క్లుప్తంగా

రోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి



నర్మెట: బండతండా నుంచి అమర్‌సింగ్ తండాకు రోడ్డు నిర్మించాలని కోరుతూ మండంలోని అమర్‌సింగ్‌తండా వాసులు కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి శుక్రవారం క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. భూక్య కొంరెల్లి, రమేశ్, యాంజీ, గణపతి, బి. రమేష్, భూక్య గాంధీ, రవి, హన్మంతు ఉన్నారు.

నివాళి

జనగామ: తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, సీనియర్ రాజకీయ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి అకాల మరణం తనను ఎంతగానో కలచి వేసిందని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. అనారోగ్యం బారినపడి కొంత కాలంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ జిట్టా శుక్రవారం మృతి చెందగా, భువనగిరిలోని ఫాం హౌజ్‌లో ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు.

సన్మానం

జఫర్‌గఢ్: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న రీచనేని కిరణ్‌కుమార్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. స్థానిక మోడల్ స్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీకాంత్ మాట్లాడుతూ కిరణ్‌కుమార్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు గణేష్, పావని, సంధ్య, జ్యోత్స్న, వెంకటేశ్వర్లు, మనోజ్‌కుమార్, శశికుమారి, నాగలక్ష్మి, నరేశ్, పాషా పాల్గొన్నారు.

తాత్కాలిక రోడ్డుకు మరమ్మతు



తెగిన రోడ్డును పరిశీలిస్తున్న సీఐ, మాజీ జెడ్పీటీసీ

లింగాలఘణపురం: మండలంలోని కుందారం–పాలకుర్తి రోడ్డులో పటేల్‌గూడెం వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలతో తెగిపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో ఈ నెల 5న 'ఎన్నాళ్లీ తిప్పలు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సీఐ శ్రీనివాసురెడ్డి, ఎస్సై ప్రవీణ్‌కుమార్‌తో పాటు మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి తెగిన తాత్కాలిక రోడ్డును శుక్రవారం పరిశీలించారు. అంతేకాకుండా గుడి వంశీధర్‌రెడ్డి సంబంధిత కాంట్రాక్టర్ వెంకట్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి తాత్కాలిక రోడ్డు మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని తెలియజేయగా సంబంధిత కాంట్రాక్టర్ స్పందించి వెంటనే పనులు మొదలు పెట్టారు.

సొంత పనులకు పంచాయతీ సిబ్బంది!

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ ఎంపీడీఓ విజయశ్రీ సొంత పనులకు జీపీ సిబ్బందిని వినియోగించిన వీడియో ఘన్‌పూర్‌కు సంబంధించిన వాట్సాప్ గ్రూపుల్లో, సోషల్ మీడియాలో శుక్రవారం వైరల్ అయింది. స్టేషన్‌ఘన్‌పూర్ నూతన ఎంపీడీఓగా విజయశ్రీ ఈనెల 4న బాధ్యతలు స్వీకరించింది. కాగా, ఘన్‌పూర్‌లో ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో ఉన్న ఓ ఇంటిలోకి ఎంపీడీఓ షిఫ్ట్ అవుతున్న క్రమంలో డీసీఎం వ్యాన్ నుంచి గృహ సామగ్రిని దించే పనులకు స్థానిక జీపీ సిబ్బందితో పనిచేయించారు. విషయం తెలుసుకున్న స్థానికులు దానిని వీడియో తీసి వాట్సాప్ గ్రూపులలో షేర్ చేయగా వైరల్ అయింది. ఈ విషయమై ఎంపీడీఓను వివరణ కోరగా స్వంత పనులకు గ్రామ పంచాయతీ సిబ్బందిని వినియోగించుకోలేదని, కూలీ వాళ్ళతో సామాన్లు షిఫ్ట్ చేయించినట్లు తెలిపారు.

ఆర్థికసాయం

చిల్పూరు: మండలంలోని ఫత్తేపూర్ గ్రామానికి చెందిన గుగులోత్ జమాని అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, శుక్రవారం బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గుగులోత్ మధు నాయక్ బాధిత సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

బోడబండతండాలో..

దేవరుప్పుల: మండల కేంద్రంలోని బోడబండ తండాకు చెందిన ధరావత్ సత్తమ్మ మృతి చెందింది. కాగా బాధిత కుటుంబాన్ని పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

జయప్రదం చేయండి



జనగామ రూరల్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టనున్న జీపు యాత్రను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలి

● ఆర్డీఓ డీఎస్ వెంకన్న



మాట్లాడుతున్న ఆర్డీఓ డీఎస్ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్‌పరిధిలో విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో గ్రామాల్లో పరిస్థితులు, పారిశుద్ధ్య, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో శుక్రవారం ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాలు నిర్వహించే వారు తప్పనిసరిగా పోలీస్ పర్మిషన్ తీసుకోవాలని, వేడుకలను నిబంధనల మేరకు నిర్వహించుకోవాలని సూచించారు. గణేశ్ ఉత్సవాల నేపథ్యంలో పోలీసువారు శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య, విద్యుత్ పరమైన సమస్యలు లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది బాధ్యతగా, సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీపీ భీమ్‌శర్మ, సీఐ జి.వేణు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ విజయశ్రీతో పాటు వివిధ మండలాల అధికారులు పాల్గొన్నారు.

రఘునాథపల్లిలో..

రఘునాథపల్లి: వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని తహసీల్దార్ సీహెచ్ విమల, ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాల్లో విగ్రహాల ఏర్పాటుకు నిర్వాహకులు అనుమతులు తప్పనిసరి తీసుకోవాలన్నారు. ఎంపీఓ వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, ఎంఆర్ఐ శరత్‌చంద్ర, ఏఆర్ఐ శ్రీనివాస్‌రావు, పలు గ్రామాల ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

మండపాలకు అనుమతి తప్పనిసరి

పాలకుర్తి టౌన్: గణేశ్ మండపాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ మహేందర్ అన్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో గణేశ్ ఉత్సవాల బాధ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎస్సైలు సాయి ప్రసన్న కుమార్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విలువైన వస్తువులు జాగ్రత్త



మాట్లాడుతున్న సీఐ దామోదర్‌రెడ్డి

జనగామ: వినాయక పండగ నేపథ్యంలో ప్రయాణం చేసే సమయంలో ప్రజలు తమ విలువైన వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలని సీఐ దామోదర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. పూజా సామగ్రి, ఇతర వస్తువులు కొనుగోలు చేసే సమయంలో దొంగలు పక్కనే ఉంటూ మిమ్మల్ని గమనిస్తూ ఉంటారన్నారు. రద్దీ ప్రాంతాల్లో మహిళలు ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. బస్సు, ఆటో ఎక్కి దిగే సమయంలో హ్యాండ్ లగేజీ, బ్యాగులు, పిల్లలను ఒకటికి రెండు సార్లు గమనిస్తూ సురక్షితంగా ఇంటికి చేరుకోవాలన్నారు. గణేశ్ మండపాలకు విద్యుత్ అధికారుల సూచనల మేరకు కరెంట్ సరఫరా కనెక్షన్ తీసుకోవాలన్నారు. అత్యవసర సమయంలో 100 నంబర్‌కు డయల్ చేసి సమాచారం అందించాలన్నారు.

మట్టి గణపతి ప్రతిమలనే పూజించాలి



జనగామ: ఏకశిల స్కూల్‌లో మట్టి గణపతి ప్రతిమలతో విద్యార్థులు



సెయింట్ పాల్స్ స్కూల్‌లో..

స్టేషన్‌ఘన్‌పూర్/చిల్పూరు/దేవరుప్పుల/జఫర్‌గఢ్/పాలకుర్తిటౌన్: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి ప్రతిమలనే పూజించాలని పలువురు వక్తలు అన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పలు పాఠశాలల్లో శుక్రవారం మట్టితో గణపతి ప్రతిమలను తయారు చేయించి విద్యార్థులకు పంపిణీ చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఛాగల్లు, చిల్పూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, దేవరుప్పుల మండలంలోని సింగరాజుపల్లి ప్రాథమిక పాఠశాల, జఫర్‌గఢ్ మండలం తిడుగు పాఠశాలలో మట్టి విగ్రహాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. అలాగే వినాయక చవితిని పురస్కరించుకొని పాల కుర్తి పట్టణంలో సుధాటెక్నో స్కూల్ సౌజన్యంతో అంతర్జాతీయ ఆర్యవైశ్య సంఘం నాయకులు వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏకశిల, సెయింట్ పాల్స్ స్కూల్‌లో మట్టి గణపతుల తయారీ

జనగామ: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణలో భాగంగా పట్టణంలోని హైదరాబాద్‌రోడ్డు ఏకశిల పబ్లిక్ స్కూల్, నెహ్రూపార్కు రోడ్డు సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో కరస్పాండెంట్ చిర్రి ఉపేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మరియ జోసెఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు స్వయంగా మట్టి ప్రతిమలను తయారు చేశారు. తల్లిదండ్రుల సమక్షంలో తయారు చేసిన విగ్రహాలను పూజించేందుకు ఇంటికి తీసుకు వెళ్లారు.

నేడు మట్టి గణపతి విగ్రహాల పంపిణీ



మట్టి గణపతులతో ఐవీఎఫ్ ప్రతినిధులు

జనగామ: వినాయక పండగను పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణ కోసం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్(ఐవీఎఫ్), తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నేడు(శనివారం) జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్కు రోడ్డు ఏరియాలో ఉచితంగా మట్టి విగ్రహాలు పంపిణీ చేయనున్నట్లు ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బిజ్జాల నవీన్ కుమార్, బా యిల్డ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్య క్షులు పజ్జూరి జయహరి తెలిపారు. రామిని శివుడు, శర్విరాల ఉపేందర్, జిల్లా సందీప్, పజూరి గోపయ్య మహంకాళి హరిచంద్ర గుప్తా, పోకల జమున లింగయ్య, గందె ఉష, ప్రసన్నలక్ష్మి, లక్ష్మీ నారాయణ, చంద్రశేఖర్, లింగమూర్తి, బెల్దె అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

గ్రామ కంఠం భూమిని రక్షించాలి

జనగామ రూరల్: మండలంలోని ఎర్రగొల్లపహాడ్ గ్రామంలో సర్వే నంబర్ 34లో గ్రామ కంఠం భూమిన రక్షించాలని సీపీఎం మండల నాయకుడు సురేశ్ కోరారు. ఈమేరకు శుక్రవారం కలెక్టరేట్ ఏఓ రవీందర్‌కు వినతి పత్రం అందజేశారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన

బచ్చన్నపేట: మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ మల్లికార్జున్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికలను దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో వసతులు, తదితరాలను పరిశీలించి అవసరమైతే పోలింగ్ కేంద్రాలను మరోచోటుకు మార్చనున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

మత విద్వేషాలు రెచ్చగొడితే చర్యలు

రఘునాథపల్లి: మత విద్వేషాలు రెచ్చగొట్టేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో హెచ్చరించారు. సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సప్, ఎక్స్, ఇన్‌స్టా తదితర మాధ్యమాల్లో మత విద్వేషాలకు సంబంధించిన ఫేక్ మెసేజ్‌లు, వీడియోలు, ఫార్వర్డ్ చేయడమూ చట్ట విరుద్ధమని పేర్కొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

జనగామ రూరల్: ఎల్ఐసీ 68 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యార్థులకు జనగామ బ్రాంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ అంశాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. మేనేజర్ బి.హరిలాల్ తదితరులు పాల్గొన్నారు. పోటీల్లో ఏకశిల పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు గెలుపొందారు.

బాధితులకు న్యాయం చేస్తాం

చిల్పూరు: ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి బాధితులకు న్యాయం చేస్తామని ఆర్ఐ కల్వల శ్రీనివాస్ అన్నారు. శ్రీపతిపల్లిలో ఆక్రమణకు గురై వివాదస్పదంగా మారిన 44, 45, 61, 62,66,68,69 సర్వే నంబర్లలోని సీలింగ్ భూములను శుక్రవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చిల్పూరు రెవెన్యూ అధికారి కల్వల శ్రీనివాస్, సర్వేయర్ నరేశ్‌నాయక్‌లు బాధితుల సమక్షంలో సర్వే నిర్వహించారు.

విరాళం అందజేత

జఫర్‌గఢ్: తిడుగు ప్రభుత్వ పాఠశాలలో ఇటీవల రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న కందూరి సుధాకర్‌రెడ్డి విద్యార్థులకు స్పోర్ట్స్ మెటీరియల్ కోసం రూ.20వేలు, పి.మనోహరస్వామి రూ.5వేల విరాళం శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తమఉపాధ్యాయులు విరాళాలు అందజేయడం అభినందనీయమని హెచ్‌ఎం సదానందం అన్నారు.

అవ్వాతాతలకు లేఖారచనలు

నర్మెట: కనుమరుగవుతున్న ఉత్తర ప్రత్యుత్తరాలను నేటి తరానికి అందించాలని లేఖారచన ప్రాధాన్యతను చిన్నారులకు వివరిస్తూ పత్తిపాక ఫౌండేషన్ గరిపెల్లి ట్రస్టు వారు స్థానిక ఉన్నత పాఠశాలలో అవ్వాతాతలకు అక్షర మాలికలు లేఖారచన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నీలం వేణు, ట్రస్టు సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో మండలంలోని పాంనూర్ గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ జనార్దన్ ఆధ్వర్యంలో 63 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

జనగామ రూరల్: పనులు ముగించుకొని చేతులు కడుక్కోవడానకి వెళ్లి విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన ఘటన ఆలేరు వద్ద చోటు చేసుకుంది. గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం.. పెంబర్తి గ్రామానికి చెందిన జన్ను కృష్ణ (40) ఆలేరులోని ప్రైవేట్ గోదాంలో హమాలీగా పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం గోదాంకువెళ్లి పనులు ముగించుకొని చేతులు, కాళ్లు కడుక్కోవడానికి బోరు వద్దకు వెళ్లగా ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందాడు. కాగా, మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

చిల్పూరు: కుటుంబ కలహాలతో ఎలుకల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... హనుమకొండ జిల్లా హసన్‌పర్తి గ్రామానికి చెందిన నామ్ శంకర్(47) కుటుంబ పోషణ కోసం భార్య, పిల్లలతో కలిసి మామునూరు సమీపంలోని బెస్తంచెరువు గ్రామానికి చేరుకుని కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. మద్యానికి బానిసైన శంకర్ భార్య సుమిత్రతో గొడవపడి ఒక్కడే చిల్పూరు మండలం కృష్ణాజీగూడెంలోని కోళ్ల ఫామ్‌లో పనికి చేరాడు. కాగా, గురువారం ఉదయం ఎలుకల మందుతాగి కిందపడిపోగా చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య సుమిత్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు.

గంజాయి స్వాధీనం

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక రైల్వేస్టేషన్ వద్ద అనుమానస్పదంగా ఉన్న కె.రాకేశ్ వద్ద ఘన్‌పూర్ పోలీసులు 50 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్న సంఘటన శుక్రవారం జరిగింది. సీఐ జి.వేణు తెలిపిన వివరాలు.. ఘన్‌పూర్ రైల్వేస్టేషన్ వద్ద వాహనాల వద్ద తనిఖీ చేస్తుండగా పాముసూర్‌కు చెందిన రాకేశ్ అనుమానస్పదంగా కనిపించగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతడి వద్ద నాలుగు గంజాయి ప్యాకెట్లు లభించాయని, మొత్తం 50 గ్రాములు ఉంటుందని తెలిపారు.

పౌష్టికాహార లోపాన్ని నివారించాలి



చిల్పూరు: పోషణ మాసంలో సీడీపీఓ ఫ్లోరెన్స్

చిల్పూరు/రఘునాథపల్లి/కొడకండ్ల/తరిగొప్పుల/జఫర్‌గఢ్/దేవరుప్పుల/బచ్చన్నపేట: పిల్లలు, బాలింతలు, గర్భిణుల్లో పౌష్టికాహార లోపం తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ అధికారులు అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన పోషణ మాసోత్సవాల్లో వారు పాల్గొని మాట్లాడారు. పోషకాలుగల ఆహార పదార్థాలను ప్రదర్శించారు. సీడీపీఓ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

అమరుల ఆశయసాధనకు కృషి



బచ్చన్నపేట: నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

బచ్చన్నపేట/స్టేషన్‌ఘన్‌పూర్/పాలకుర్తి/రఘునాథపల్లి/జఫర్‌గఢ్/జనగామ రూరల్: వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కమిటీ సభ్యుడు చుంచు విజయేందర్ అన్నారు. రైతాంగ సాయుధ పోరాట పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని పోచన్నపేట, నక్కవాని గూడెం, పడమటి కేశవాపురం, లింగంపల్లి, మన్‌సాన్‌పల్లి, సాల్వాపురం, మల్లు స్వరాజ్యం కాలనీలో అమరుల స్థూపాలకు నివాళులర్పించి ఎర్రజెండాను ఎగుర వేశారు. పోచన్నపేటలో బండ వరం హనుమయ్య, కేశిరెడ్డిపల్లిలో ఎడబోయిన సాయిరెడ్డి, చల్లా నర్సిరెడ్డి, శ్రావణ బోయిన లక్ష్మయ్య, పడమటి కేశవాపూర్‌లో పండరి స్థూపాలకు నివాళులర్పించారు. అలాగే స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ఇప్పగూడెం, పాలకుర్తిలోని పలు గ్రామాల్లో, రఘునాథపల్లి మండల కేంద్రంలో, జఫర్‌గఢ్‌లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల పక్షోత్సవాల్లో భాగంగా జెండాలను నాయకులు ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో కేజీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య, రాపర్తి సోమయ్య, మునిగెల రమేశ్, సారయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

పాలకుర్తి: ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనదని ఎంపీడీఓ రాములు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి సన్మాన కార్యక్రమాన్ని మండల నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. బైకాని వెంకటయ్య, చిదురాల శ్రీనివాస్, వీరమల్ల బాబయ్య, ఇమ్మడి అశోక్, తండ మల్లయ్య, శోభారాణి, రమేశ్ పాల్గొన్నారు.

సన్మానం

లింగాలఘణపురం: మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 18 మంది ఉపాధ్యాయులను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో సన్మానించారు. మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్‌రావు, ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి, ఎంపీఓ రఘురామకృష్ణ పాల్గొన్నారు.

అనేక రూపాలు.. ప్రత్యేక ఆకర్షణ


జనగామ: హిందూ సంప్రదాయంలో తొలిపూజ గణపతికి ప్రాధాన్యం ఇస్తారు. వ్యాపారం, శుభకార్యం ఇలా ఏ పని చేసినా మొదటగా విఘ్నాలు, ఆటంకాలు లేకుండా చూడాలని విఘ్నేశ్వరుడి అనుగ్రహం పొందుతారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునేలా ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో ఐదు దశాబ్దాలకు పైగా ఉత్సవాలను నిర్వహిస్తూ, ఎవరికి వారే ప్రత్యేకతను చాటుకుంటున్నారు. నేడు వినాయక చవితి పండగను పురస్కరించుకుని 'సాక్షి' ప్రత్యేక కథనం.

మట్టిగణపతి ప్రత్యేకత



జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్కు ఏరియా వాస్తు గణపతి దేవాలయ ప్రాంగణంలో 36 సంవత్సరాలుగా గణపతి నవ రాత్రి ఉత్సవాలనే ఏటా ఓ ప్రత్యేకతతో నిర్వహిస్తారు. 1989లో ప్రారంభమైన నవరాత్రి వేడుకలతో నెహ్రూ పార్కు వినాయకుడు జిల్లాకే ఐకాన్‌గా మారింది. ఏటా ఖైరతాబాద్ తరహా దేవతా మూర్తుల రూపంలో ఆకర్షణీయంగా కనిపించే ప్రతిమను పూజించడం ఇక్కడ ఆనవాయితీ. గడిచిన పదేళ్లుగా పర్యావరణ పరిరక్షణ కోరుతూ మట్టి గణపతికే ప్రియార్టీ ఇస్తున్నారు.

ఆలయాన్ని తలపించే మండపం



జిల్లా కేంద్రంలోని సత్రం రోడ్డు 26–27వ వార్డు పరిధిలో యూత్ గణేశ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం ఆలయానికి వెళ్లిన అనుభూతిని కలిగిస్తుంది. గత 42 ఏళ్లుగా ఇక్కడ నవరాత్రి ఉత్సవాలు జరుపుకుంటున్నారు. తొమ్మిది రోజుల పాటు తీరొక్క నైవేద్యాలతో స్వామికి పూజ చేస్తారు. స్వామికి పూజలు, అలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలను నిత్యం నిర్వహిస్తారు.

స్వామి పెళ్లి..



సిద్ధి-బుద్ధి వినాయకస్వామి

దేశంలో చాలా తక్కువ ప్రాంతాల్లో గణపయ్య వివాహం జరుగుతుంది. జనగామ పట్టణంలోని గణేశ్ స్ట్రీట్(బొంద్రవెంకయ్య) ఆలయంలో ఏటా నవరాత్రి ఉత్సవాల్లో సిద్ధి-బుద్ధి అమ్మవార్లుతో విఘ్నేశ్వరుడి వివాహం అత్యంత వైభవోపేతంగా జరిపిస్తారు. ఈ మనోహర ఘడియలను వీక్షించేందుకు వేలాది మంది భక్తులు హాజరవుతారు. వివాహ అనంతరం సాయంత్రం పట్టణంలో ఊరేగింపు నిర్వహిస్తారు. వందేళ్ల చరిత్ర కలిగిన స్వయంభూ విఘ్నేశ్వర ఆలయంలో ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కోరుతూ కల్యాణ మహోత్సవ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

కండువా కొంటే కలిసొస్తుందనే నమ్మకం



వీవర్స్ కాలనీలోని మండపం

పట్టణంలోని వీవర్స్ కాలనీలో పద్మశాలి కులబంధువులు 42 సంవత్సరాలుగా వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు జరుపుతున్నారు. ఇక్కడి ప్రత్యేకత వేలం పాటల్లో కండువా కొనుగోలు చేసిన వారికి అన్నింట్లో కలిసి వస్తుందని నమ్మక ం. స్వామి చేతిలో పూజలందుకునే లడ్డూకు సైతం పోటీ పడి కొనుగోలు చేస్తా రు. ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు చేస్తారు.

చేనేత కార్మికులు తరలిరావాలి

రఘునాథపల్లి: హైదరాబాద్ నాంపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 9న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ కాలేజీని ప్రారంభించనున్న నేపథ్యంలో ప్రతి గ్రామం నుంచి చేనేత కార్మికులు తరలిరావాలని పద్మశాలి సంఘం జిల్లా నాయకుడు రాపోలు రామ్మూర్తి, ప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం వారు మాట్లాడారు. హైదరాబాద్‌కు వెళ్లేందుకు రఘునాథపల్లి మండల వాసులకు మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తున్నామని, చేనేత కార్మికులు పెద్ద ఎత్తున తరలి రావాలని వారు కోరారు.

టీపీసీసీ అధ్యక్షుడి నియామకంపై హర్షం



జనగామ: టీపీసీసీ అధ్యక్షుడిగా బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ నియామకంపై డీసీసీ అధ్యక్షుడు, జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న ఆయనకు పీసీసీ అధ్యక్షుడిగా ఏఐసీసీ బాధ్యతలను అప్పగించడాన్ని స్వాగతిస్తూ అభినందనలు తెలిపారు.

మహేష్‌కుమార్ గౌడ్‌తో కలిసి ముందుకెళ్తాం..




టీపీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్‌గౌడ్ నియమకంపై టీపీసీసీ అధికార ప్రతినిధి, హెచ్‌డబ్ల్యూడబ్ల్యూ, ఎస్కేయూ అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నూతనంగా టీపీసీసీ బాధ్యతలు చేపట్టనున్న మహేష్ కుమార్‌గౌడ్‌తో కలిసి ముందుకు వెళ్తామన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు

టీపీసీసీ అధ్యక్షుడిగా బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ నియామకాన్ని స్వాగతిస్తూ పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చి రెడ్డి, డాక్టర్ రాజమౌళి, మేడ శ్రీ నివాస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తాలో సంబురాలు జరుపుకున్నారు. బాణాసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే పట్టణం లోని 17వ వార్డులో కౌన్సిలర్ జక్కుల అనితవేణుమాధవ్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు.

కొడకండ్ల: టీపీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్ నియామకంపై కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ హర్షం వ్యక్తం చేశారు. పార్టీ శ్రేయస్సు కోసం అంకితభావంతో పనిచేసిన బీసీ సామాజిక వర్గానికి చెందిన మహేష్‌కుమార్‌గౌడ్ సేవలను కాంగ్రెస్ అధిష్టానం గుర్తించి అధ్యక్షుడిగా నియమించడం సంతోషంగా ఉందన్నారు.

జఫర్‌గఢ్‌లో..



జఫర్‌గఢ్: పీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్ ఎంపికపై హర్షం వ్యక్తం చేస్తూ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నాయకులు, కార్యకర్తలు బాణసంచాలు కాల్చి సంబురాలు చేసుకున్నారు. జ్యోతి యాకయ్య, రమేశ్, మల్లయ్య, రాజ్‌కుమార్, రాజయ్య ఉన్నారు.